సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం : 30 : ఆగస్టు : 2023



రెగ్యులర్ ఈఓగా రమాదేవి

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ రెగ్యులర్ ఈఓగా రమాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 10లో



.. మా సత్తా చాటుతాం

వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టుల సత్తా ఏంటో చూపిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం 34° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎస్పార్ జీఎంగా కవితానాయుడు



కవితానాయుడు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ ఈఈ సెల్, సీఎస్పార్ జీఎంగా కవితానాయుడు నియమితుల య్యారు. ఇదే సెక్షన్‌లో ఏజీఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఆమెకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా, సింగరేణి చరిత్రలో మొట్టమొదటి జీఎం పర్సనల్ మహిళా అధికారిగా ఆమె రికార్డుకెక్కారు. గతంలో ఐటీ జీఎంగా మహిళా అధికారి విధులు నిర్వర్తించినా.. సీఎస్పార్ జీఎంగా మాత్రం కవితానాయుడు మొదటి అధికారిగా పేరు నమోదు చేసుకున్నారు.

సింగరేణి డీవైసీఎంఓగా సునీల

కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి డీవైసీఎం(స్పెషలిస్ట్)గా డాక్టర్ సునీల నియమితులయ్యారు. ఈ మేరకు సీఎస్పార్ చీఫ్ అధికారి కవితానాయుడు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆమె ఈ పోస్టుతో పాటు సీపీఆర్ఎంఎస్ బిల్ సెక్షన్‌ను కూడా చూస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

- జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రాజశేఖర్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజశేఖర్

పాల్వంచ : విద్యార్థుల్లో కనీస భాషా, గణిత సామర్థ్యాలను పెంపొందిస్తూ, సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.రాజశేఖర్ అన్నారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణ కార్యక్రమాన్ని పాత పాల్వంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ సమర్థవంతంగా అమలు చేసే విధానాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఉన్నత పాఠశాలల్లో గుణాత్మక విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

భాషపై పట్టు సాధించాలి

ఇల్లెందురూరల్: ప్రతి విద్యార్థి భాషపై పట్టు సాధించేలా తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ అన్నారు. మండలంలోని సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో ఉన్నతి కార్యక్రమంలో భాగంగా హిందీ సబ్జెక్టుపై ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో చదవడం, రాయడం, మాట్లాడటమే లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. దీనికోసం శిక్షణ శిబిరంలో అందించే సూచనలు పాటించాలన్నారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థి ఉన్నత తరగతుల్లో ఏ భాషను ఎంచుకున్నా రాణించేలా ప్రాథమిక బోధన ఉండాలని సూచించారు. అనంతరం శిక్షణ తరగతులను ఆయన పర్యవేక్షించారు. సమావేశంలో కోర్సు డైరెక్టర్ శారద, నోడల్ అధికారి స్వామి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రామాలయం ఈఓ

సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాచలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఈఓ ఎల్.రమాదేవి మంగళవారం కలెక్టర్ ప్రియాంక అలను ఐడీఓసీలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

మంత్రి పువ్వాడను కలిసిన చిన్ని



మంత్రి పువ్వాడను సత్కరిస్తున్న చిన్ని

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇటీవల బీజేపీకి రాజీనామా చేసిన కోనేరు సత్యనారాయణ(చిన్ని) మంగళవారం ఖమ్మంలో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా చిన్ని బీఆర్ఎస్ పార్టీలో చేరికపై చర్చించినట్లు తెలిసింది.

రాజకీయం రాజధానికి..

హైదరాబాద్‌కు తరలుతున్న జిల్లా నేతలు

- గాంధీభవన్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల వడపోత
- దరఖాస్తు చేసిన ఆశావహుల్లో ఉక్కపోత
- నలుగురు అభ్యర్థులతో భేటీ అయిన కేసీఆర్



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర రాజధాని వేదికగా జిల్లా రాజకీయాల్లో వేడి రగులుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇటు అధికార భారత రాష్ట్ర సమితి అటు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు చకచకా పావులు కదుపుతున్నాయి. ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్.. తదుపరి కార్యాచరణలోకి దిగింది. మరోవైపు ఆశావహుల వడపోత కార్యక్రమాన్ని కాంగ్రెస్ చేపట్టింది.

కాంగ్రెస్ నుంచి 70 మంది దరఖాస్తు..

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి కాంగ్రెస్ పార్టీ ఆగస్టు 25 వరకు దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 70 మంది దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గాల వారీగా ప్రాధాన్యతా క్రమంలో ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేసే పనిని ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ పేరుతో కాంగ్రెస్ పార్టీ మంగళవారం చేపట్టింది. 26 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో జిల్లాకు సంబంధించి డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యతో పాటు రేణుకాచౌదరి, మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నారు. సోమవారం సాయంత్రం ఈ సమావేశం ఖరారు కావడంతో పొంగులేటి, పొదెం వీరయ్య మంగళవారం తమ పర్యటనను రద్దు చేసుకుని హుటాహుటిన హైదరాబాద్ వెళ్లారు.

నేతల్లో టెన్షన్..

ఎన్నికల్లో హస్తం గుర్తుపై పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నియోజవకర్గాల వారీగా ఇల్లెందు- 32, భద్రాచలం- 3, పినపాక-17, అశ్వారావుపేట- 08, కొత్తగూడెం - 10 మంది ఉన్నారు. ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ ఇందులో ముగ్గురిని ఎంపిక చేసి ఆ తర్వాత దశలో స్క్రీనింగ్ కమిటీకి పంపుతుంది. అయితే అభ్యర్థుల తొలి వడపోత ఎప్పుడనే అంశంపై సోమవారం సాయంత్రం వరకు ఎలాంటి స్పష్టత లేకపోగా, ఉన్నట్టుండి ఆకస్మికంగా మంగళవారమే ఎలక్షన్ కమిటీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో ఆశావహుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. స్క్రీనింగ్ కమిటీకి వెళ్లే జాబితాలో ఉండే మూడు పేర్లలో తమది ఉండేలా లాబీయింగ్ చేసుకునేందుకు ఎక్కువ సమయం దొరకలేదనే టెన్షన్ అభ్యర్థుల్లో నెలకొంది. మరికొందరు పట్టువదలకుండా గాంధీభవన్‌కు చేరుకుని తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇటు ప్రగతి భవన్‌లో..

2014 అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై పోటీ చేసినా జిల్లాలో ఒక స్థానానికే పరిమితం కాగా, 2018లో ఆ ఒక్కటి కూడా రాక చేదు ఫలితాలే మిగిలాయి. దీంతో ఎలాగైనా ఇక్కడ గులాబీ జెండా ఎగరేయాలనే పట్టుదల బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంలో పెరిగింది. అందులో భాగంగా జిల్లాపై సీఎం కేసీఆర్ స్వయంగా ఫోకస్ పెట్టారు. జిల్లాలో ఉన్న నాలుగు ఎస్టీ స్థానాలకు సంబంధించిన అభ్యర్థులను హైదరాబాద్‌కు ప్రత్యేకంగా పిలిపించారు. శనివారం సాయంత్రం ఈ సమావేశం జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల రద్దయినప్పటికీ.. ఆదివారం కేసీఆర్ సమయం కేటాయించారు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేయబోతున్న రేగా కాంతారావు (పినపాక), మెచ్చా నాగేశ్వరరావు(అశ్వారావుపేట), హరిప్రియనాయక్ (ఇల్లెందు), తెల్లం వెంకట్రావు (భద్రాచలం) సీఎంతో సమావేశం అయ్యారు.

విడివిడిగా..

పార్టీ పరంగా ఏమైనా సూచనలు చేస్తే అందరినీ ఒకే దగ్గర సమావేశపరిచి, సామూహికంగా తాను చెప్పాలనుకున్న అంశాలను వివరించడం కేసీఆర్ స్టైల్.. కానీ జిల్లాకు చెందిన గిరిజన నియోజవకర్గాల విషయంలో ఈ సంప్రదాయానికి ఆదివారం బ్రేక్ పడింది. రాబోయే ఎన్నికల్లో గెలిచేందుకు ఆయా నియోజకవర్గాల్లో ప్రభుత్వం, పార్టీ పరంగా ఎటువంటి మద్దతును అభ్యర్థులు కోరుకుంటున్నారనే వివరాలను సీఎం కేసీఆర్ స్వయంగా రాబట్టినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ఒక్కో అభ్యర్థికి ఐదు నిమిషాల పాటు సమయం ఇచ్చారు. పార్టీపరంగా కేసీఆర్, అభ్యర్థుల నడుమ మరెవరినీ ఈ సమావేశానికి అనుమతించలేదు. ఒక్కో అభ్యర్థితో సీఎం కేసీఆర్ వన్ అండ్ వన్ మాట్లాడినట్టు ప్రగతిభవన్ వర్గాల సమాచారం. ఎంపీ జోగినపల్లి సంతోశ్ ఒక్కరే ఈ సమావేశానికి సంధానకర్తగా వ్యవహరించారు.

పోటాపోటీగా దరఖాస్తులు

- కాంగ్రెస్ నుంచి 120 మంది దరఖాస్తు
- అత్యధికంగా ఇల్లెందులో 32 మంది..
- మధిర నియోజకవర్గం నుంచి ఇద్దరే

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా దరఖాస్తు చేసుకున్న ఆశావహుల జాబితాను టీపీసీసీ వెల్లడించింది. ఈమేరకు మంగళవారం టీపీసీసీ ఎన్నికల కమిటీ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సమావేశమై దరఖాస్తుదారుల జాబితా రూపొందించింది. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి పది నియోజకవర్గాలకు 120 దరఖాస్తులు అందినట్లు వెల్లడించింది. అత్యధికంగా ఇల్లెందు నియోజకవర్గానికి 32 మంది దరఖాస్తు చేసుకోగా... మధిర నుంచి రెండే దరఖాస్తులు అందాయి. ఇక పినపాక నుంచి 17మంది, వైరా నుంచి 15మంది, పాలేరు నుంచి 14మంది, సత్తుపల్లి, కొత్తగూడెం నుంచి పది మంది చొప్పున దరఖాస్తు చేసుకున్నారు. ఖమ్మం నుంచి తొమ్మిది మంది, అశ్వారావుపేట నుంచి ఎనిమిది మంది, భద్రాచలం నియోజకవర్గం నుంచి ముగ్గురు దరఖాస్తులు సమర్పించారు.

నియోజకవర్గాల వారీగా ఇలా...

- **కొత్తగూడెం** నుంచి పోటీ కోసం పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నాగ సీతారాములు, యడవల్లి కృష్ణ, పోట్ల నాగేశ్వరరావు, మోతుకూరి ధర్మారావు, కొండూరి శ్రీనివాసరావు, నూనావత్ శంకర్‌నాయక్, ఊకంటి గోపాల్‌రావు, తోట దేవీప్రసన్న, లక్కినేని సురేందర్‌రావు దరఖాస్తు చేసుకున్నారు.
- **అశ్వారావుపేట** నుంచి తాటి వెంకటేశ్వర్లు, వీసం ప్రేంకుమార్, వగ్గెల పూజ, సున్నం నాగమణి, బానోత్ దంజు, దారబోయిన రమేష్, జారే ఆదినారాయణ, కాట్రం నర్సింహారావు దరఖాస్తు చేశారు.
- **భద్రాచలం** నియోజకవర్గం నుంచి పొదెం వీరయ్య, గొండి బాలయ్య, పేర్ల కృష్ణబాబు దరఖాస్తులు అందాయి.
- **పినపాక** నియోజకవర్గంలో గొండ్ల వెంకటేశ్వర్లు, కనితి భాస్కర్‌రావు, ధనసరి సూర్య, పాయం వెంకటేశ్వర్లు, ఆసు సరస్వతి, చందా సంతోష్ కుమార్, ఆలేం రవికుమార్, కొమరం లక్ష్మణ్‌రావు, బట్ట విజయ్‌గాంధీ, కాటిబోయిన నాగేశ్వరరావు, కనితి కృష్ణ, ఊకే ముద్దరాజు, పోలేబోయిన శ్రీవాణి, తోలేం నాగేశ్వరరావు, కొమరం కాంతారావు, ఆనంద్ కోర్స, దుంగ్రోత్ వెంకటేశ్వరరావు ఉన్నారు.
- **ఇల్లెందు** నియోజకవర్గానికి బానోత్ విజయలక్ష్మి, గుగులోత్ కృష్ణనాయక్, చీమల వెంకటేశ్వర్లు, తేజావత్ బెల్లయ్య నాయక్, మాలోతు ఉదయ్‌సింగ్, అజ్మీరా శంకర్, భూక్యా మంగీలాల్ నాయక్, భూక్యా దళ్‌సింగ్‌నాయక్, కోరం కనకయ్య, పూనెం భూక్యా చంద్రకళ, మోకాళ్ల శ్రీనివాసరావు(శ్రీనివాస్ దొర), భూక్యా స్రవంతి, బానోత్ వెంకటేశ్వర్లు, డాక్టర్ గుగులోతు రవి, దుంగ్రోత్ వెంకటేశ్వరరావు, గుడెబోయిన నాగమణి, డాక్టర్ బానోత్ సంజయ్‌నాయక్, బానోత్ వెంకటప్రవీణ్‌నాయక్, డాక్టర్ భూక్యా రామచంద్రనాయక్, నూనావత్ రాధ, పోరిక సాయిశంకర్, కలతి వెంకటేశ్వర్లు, మకాల శ్రీనివాసరావు, ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్, నూనావత్ శంకర్‌నాయక్, అరెం పాపారావు, మాలోతు వెంకటలాల్, డాక్టర్ బానోత్ నాగేశ్వరరావు, ఆంగోతు శివకుమార్, పెండెకట్ల యాకయ్య, ఆంగోత్ నమోదర్‌నాయక్, బానోత్ సామ్లా ఉన్నారు.
- **వైరా** నియోజకవర్గం నుంచి పాలకుర్తి నాగేశ్వరరావు, బానోత్ బాబు(అర్జున్), మాలోత్ రాందాస్, బానోత్ సైదేశ్వరరావు, లకావత్ చంద్ర నాయక్, బండ్ల రాంబాబు, ఆంగోతు శ్రీమన్నారాయణ, బానోతు విజయబాయి, దుంగ్రోత్ వెంకటేశ్వరరావు, వాంకుడోతు దీపక్, కూతాడి కుమార్, లకావత్ సైదులు, భూక్యా భిక్షపతి రాథోడ్ ఉన్నారు.

‘ధరణి’ సమస్యలు పరిష్కరించండి

తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ధరణి పోర్టల్‌లో సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రియాంక అల తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ.. పాస్ పుస్తకాల్లో సవరణ కోసం వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ధరణి ఫైళ్లను వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేసి సిఫారసు చేయాలన్నారు. భూసమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి ప్రజావాణికి వస్తున్నారని, మండల స్థాయిలోనే పరిష్కరిస్తే ప్రజలు కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం లేదని అన్నారు. దరఖాస్తులను తనిఖీ చేస్తామని, పొరపాట్లు ఉంటే బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారుల విచారణ ప్రక్రియ పూర్తి చేసి, ఎమ్మెల్యేలకు సిఫారసు చేయాలని చెప్పారు. జీఓ 76 దరఖాస్తుల విచారణ ప్రక్రియ పెండింగ్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో అటవీశాఖాధికారి కృష్ణగౌడ్, అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరెడ్డి, ఆర్డీఓలు శిరీష, మంగీలాల్, ఎస్‌డీసీ కాశయ్య పాల్గొన్నారు.

పంటనమోదు పూర్తి చేయాలి

పంటనమోదు కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రియాంక అన్నారు. వ్యవసాయ, ఉద్యాన అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అభిమన్యుడు, మరియన్న, లాల్‌చంద్, సాయినారాయణ, దీపక్‌ఆనంద్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

చట్టాలను చేతుల్లోకి తీసుకోవడం నేరమే



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: ఎవరైనా చట్టాలను చేతుల్లోకి తీసుకోవడం నేరమే అవుతుందని భద్రాచలం ఫస్ట్ క్లాస్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సబ్ జైలులో మంగళవారం ఖైదీలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. నేరాల అదుపునకు ఖైదీల సహకారం అవసరమన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. రాజీ మార్గంలో పరిష్కరించుకునే లోక్ అదాలత్ కేసులకు పై కోర్టుల్లో అప్పీల్ సైతం ఉండదన్నారు. పోక్సో, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పనితీరు, లీగల్ సర్వీసెస్ చట్టాలు తదితర విషయాలపై ఖైదీలకు వివరించారు. అనంతరం జైలులో సదుపాయాలు, ఖైదీలకు అందించే ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ లాయర్ బాసం శారద, జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ మెంబర్ డి.సంధ్య, జైలు సూపరింటెండెంట్ ఉపేందర్ పాల్గొన్నారు.

నేడు పెద్దమ్మతల్లి గుడిలో దుకాణాల వేలం

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో బుధవారం 11 దుకాణాలు, కొబ్బరి చిప్పల సేకరణ, భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేలంలో పాల్గొనే వారు ఉదయం 10 గంటల వరకు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నిర్లక్ష్యంపై వేటు

- రామవరం ఎంసీహెచ్‌లో నవజాత శిశువు మృతి
- ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమన్న బాధితులు
- విచారణ చేపట్టిన సూపరింటెండెంట్
- ఒక వైద్యుడు, ముగ్గురు స్టాఫ్ నర్సులపై సస్పెన్షన్ వేటు
- ఇద్దరిని విధుల నుంచి తొలగించాలంటూ ఆదేశాలు



మృతి చెందిన శిశువు

కొత్తగూడెంఅర్బన్: ఎన్ని నిధులు ఉన్నా, ఎంతటి సౌకర్యాలు కల్పించినా సరైన పర్యవేక్షణ కొరవడితే, అవన్నీ నిష్ఫలమే అనేందుకు రామవరం మాతాశిశు ఆస్పత్రి ఉదాహరణగా నిలిచింది. అత్యవసర వైద్య సేవలు అందించడంలో ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం ఓ నవజాత శిశువు మృతికి కారణమైంది. నష్టం జరిగిన తర్వాత తేరుకున్న పై అధికారులు తీరిగ్గా విచారణ చేపట్టి సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేశారు.

కాపాడండయ్యా..

రామవరంలోని మతా, శిశు ఆస్పత్రికి దమ్మపేట మండలం మొండివరం గ్రామానికి చెందిన శిరీష అనే గర్భిణి వచ్చింది. సోమవారం రాత్రి ఆమెకు కవలలు (మగ, ఆడ) జన్మించారు. కవలలు పుట్టారనే ఆనందం కొన్ని గంటల్లోనే ఆవిరైంది. మంగళవారం తెల్లవారుజామున ఆడ శిశువు మృతి చెందింది. ప్రసవం జరిగిన కొద్ది గంటలకే ఆడ శిశువుకు అనారోగ్య సమస్యలు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని శిరీష వైద్య సిబ్బంది దృష్టికి తీసుకెళ్లింది. డ్యూటీ డాక్టర్‌ను పిలిపించి శిశువును పరీక్షించాలని కోరింది. అయితే.. పుట్టిన తరువాత శిశువులు అలాగే చేస్తారని, ఏమి కాదని సిబ్బంది నచ్చజెప్పారు. ఎలాంటి వైద్య సేవలు అందించలేదు. ఆ తర్వాత పరిస్థితి విషమించడంతో శిశువు అచేతన స్థితికి చేరుకుంది. మంగళవారం తెల్లవారుజామున శిశువును పరీక్షించిన వైద్య సిబ్బంది.. ‘తక్కువ బరువుతో పుట్టడంతో ఆడ శిశువు మృతి చెందింది’ అని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. ఈ ఘటనపై బాధిత కుటుంబసభ్యులు ఆస్పత్రి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

సూపరింటెండెంట్ విచారణ

ఎంసీహెచ్ ఆస్పత్రిలో జరిగిన ఘటనపై సూపరింటెండెంట్ కుమారస్వామి మంగళవారం విచారణ చేపట్టారు. సోమవారం రాత్రి నుంచి విధుల్లో ఉన్న వారిని పిలిచి ప్రశ్నించారు. ఇందులో రాత్రి డ్యూటీలో వైద్యుడు ఉన్నారని, అతడిని వార్డుకు తీసుకరావడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని తేలింది. శిశువు ఆరోగ్య పరిస్థితి విషమిస్తోందని బాధితులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సిబ్బంది దాన్ని పెడచెవిన పెట్టినట్టు గుర్తించారు. అలాగే సమయానుకూలంగా రౌండ్స్‌కు రావాల్సిన వైద్యుడు సైతం విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్టు తేలింది.

సస్పెన్షన్ వేటు..

శిశువు మృతి చెందిన ఘటనకు బాధ్యులుగా చేస్తూ ఆస్పత్రిలో ఒక పిల్లల వైద్యులు, ముగ్గురు స్టాఫ్‌నర్సులను సస్పెండ్ చేశారు. ఇద్దరు సహాయకులను విధుల నుంచి తొలగించారు. శాఖాపరమైన చర్యల కోసం తాత్కాలికంగా సస్పెండ్ చేశామని వివరించారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టాక తదుపరి చర్యలు తీసుకుంటామని కుమారస్వామి తెలిపారు.

వానమ్మా.. రావమ్మా

- లోటు వర్షపాతంతో ఆందోళనలో రైతులు
- బిందెలతో నీళ్లు పోసి పత్తిని బతికించుకుంటున్న వైనం
- ఈ నెలలో భారీగా లోటు వర్షపాతం
- ఎండిపోతున్న వరి, ఇతర పంటలు



పాల్వంచ మండలం రెడ్డిగూడెంలో పత్తి మొక్కలకు బిందెతో నీరు పోస్తున్న రైతు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులపై వరుణుడు కరుణ చూపడం లేదు. వర్షాలు లేక పంటలు ఎండిపోతుండడంతో వారు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే తమకు తీవ్ర నష్టాలు తప్పవని మథనపడుతున్నారు. పత్తి, ఇతర పంటలు ఎండిపోతుండడంతో పలువురు రైతులు బిందెలతో నీరు పోస్తూ కాపాడుకుంటున్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్ ముందస్తుగా ప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. అయితే జూన్‌లో లోటు వర్షపాతం నమోదు కావడంతో ఆ లక్ష్యం నెరవేరలేదు. జూలైలో వర్షాలు జోరందుకోవడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపట్టారు. పత్తి, వరి పంటలు అంచనాలకు మించి సాగు చేశారు. అయితే ఆగస్టులో తిరిగి వరుణుడు ముఖం చాటేశాడు. అనావృష్టి ఇలాగే కొనసాగితే రైతులు కోలుకోలేని దెబ్బతినే ప్రమాదం ఉంది. ముఖ్యంగా సాధారణ విస్తీర్ణానికి మించి పత్తి సాగు చేసిన రైతులు వర్షాభావ పరిస్థితులతో బావురుమంటున్నారు.

జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణం..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 4,25,393 ఎకరాలు సాధారణ విస్తీర్ణం అంచనా కాగా, ఇప్పటివరకు 4,83,893 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. అయితే వరిపంట మాత్రం సాధారణం కంటే కొంత తక్కువగానే వేశారు. జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 1,51,119 ఎకరాలు కాగా ఇప్పటివరకు 1,14,654 ఎకరాల్లో (76 శాతం) సాగు చేశారు. ఆగస్టు చివరి వరకు కూడా వరి వేసుకునే అవకాశం ఉందని, ఈ విస్తీర్ణం ఇంకా పెరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. జొన్న సాధారణ అంచనా 20 ఎకరాలు కాగా ఇప్పటివరకు అసలు వేయనే లేదు. మొక్కజొన్న 32,717 ఎకరాలకు 51,895 ఎకరాల్లో, పత్తి 1,39,598 ఎకరాలకు 1,99,720 ఎకరాల్లో, పెసర 288 ఎకరాలకు 206 ఎకరాల్లో, మినుము 503 ఎకరాలకు గాను 147 ఎకరాల్లో, కంది 5,611 ఎకరాలకు గాను 5,775 ఎకరాల్లో సాగు చేశారు. ఇక వేరుశనగ 1,376 ఎకరాలకు గాను 224 ఎకరాల్లో మాత్రమే వేయడంతో 16.28 శాతం మాత్రమే నమోదైంది. నువ్వులు 143 ఎకరాలకు 23 ఎకరాల్లో, అలసంద 131 ఎకరాలకు 36 ఎకరాల్లో, మిరప 14,404 ఎకరాలకు గాను 7,799 ఎకరాల్లో, చెరకు 1,245 ఎకరాలకు గాను 104 ఎకరాల్లో పంటలు వేశారు. ఆయిల్‌పామ్ 32,638 ఎకరాలకు గాను అధికంగా 58,314 ఎకరాల్లో సాగు చేయడం విశేషం. ఇతర పంటలన్నీ కలిపి సాధారణ విస్తీర్ణం అంచనా 45,600 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 44,996 ఎకరాల్లో సాగవుతున్నాయి.

వర్షపాతం వివరాలిలా..

వర్షాకాలం ప్రారంభంలో అంటే జూన్‌లో 164.4 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 80.3 మి.మీ. వర్షం మాత్రమే కురిసి 51.2 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో ఐదు రోజులు మాత్రమే వర్షాలు కురిశాయి. ఇక జూలైలో 302.5 మి.మీ. సాధారణ వర్షపాతానికి 615 మి.మీ. వర్షం కురిసింది. ఆగస్టులో 280.7 మి.మీ. వర్షం పడాల్సి ఉండగా, మంగళవారం నాటికి 142.7 మి.మీ. కురిసింది. అంటే 50 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దీంతో అనావృష్టి పరిస్థితులు ఏర్పడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం ముగియడానికి మరో నెల మాత్రమే ఉండడంతో పంటల సంరక్షణ ఎలా అని కలవరపడుతున్నారు.

అధికారుల సూచనలు పాటించాలి



సెప్టెంబర్ 10 వరకు వరి, చివరి వారం వరకు మిరప పంటలు వేసుకునే అవకాశం ఉంది. దీంతో ఈ పంటల విస్తీర్ణం ఇంకా పెరుగుతుంది. అయితే ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల రక్షణకు అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలి.

– కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

మొక్కలు వడలిపోతున్నాయి



జూలైలో కురిసిన వర్షాలతో పత్తి, మిరప పంటలు వేశాను. ప్రస్తుతం వర్షాలు లేక పంటలు వడలిపోతున్నాయి. మోటార్ల ద్వారా పెట్టే నీరు సరిపోవడం లేదు. పంటలు తెగుళ్లబారిన పడుతున్నాయి. వర్షాలు ఇలాగే పోతే పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదు.

– సామినేని రామారావు, రైతు, చుంచుపల్లి మండలం

క్లుప్తంగా

రక్షాబంధన్‌కు ప్రత్యేక బస్సులు

కొత్తగూడెంఅర్బన్: రక్షాబంధన్ సందర్భంగా కొత్తగూడెం డిపో నుంచి ఇల్లెందు, మణుగూరు, భద్రాచలం, ఖమ్మం పట్టణాలకు అదనపు బస్సులు నడుపనున్నట్లు కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30, 31వ తేదీల్లో రక్షా బంధన్ సందర్భంగా బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ప్రత్యేక బహుమతులు కూడా ఇస్తామని పేర్కొన్నారు. టికెట్ వెనుక పేరు, ఊరు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్లలో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా బాక్స్‌లో వేయాలని సూచించారు.

శ్రీనరసింహ సేవా వాహిని రికార్డు


రికార్డు పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీ నరసింహ సేవా వాహిని సంస్థ విశ్వగురు వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. గతేడాది రెండు తెలుగు రాష్ట్రాల్లో 108 గ్రామాల్లో 1,008 మంది రైతులతో ఒకేసారి ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. దీంతో విశ్వ గురు వరల్డ్ రికార్డుకు ఎంపిక చేసినట్లు ఆ సంస్థ స్థాపకుడు సత్యవోలు రాంబాబు తెలిపారు. మంగళవారం భద్రాచలం పట్టణంలోని అహోబిలం మఠంలో జరిగిన కార్యక్రమంలో సేవా వాహిని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామికి అందజేశారు. శ్రీధర్ శర్మ, శ్రీనివాసశర్మ, పవన్ శర్మ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలేని బ్రిడ్జి పనులు నిలిపివేయాలి

సీపీఐ మావోయిస్టు ఇల్లెందు–నర్సంపేట ఏరియా కార్యదర్శి పాపన్న

కొత్తగూడెంటౌన్: గుండాల మండలంలో నాణ్యత లేకుండా చేపట్టిన బ్రిడ్జి పనులను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ మావోయిస్టు ఇల్లెందు–నర్సంపేట ఏరియా కార్యదర్శి పాపన్న మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గుండాల పరిధిలోని సాయినపల్లి గణాపురం, మోతేలో నాణ్యతలేకుండా బ్రిడ్జిలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఏడాదికాక ముందే ఇవి కూలిపోయే ప్రమాదం ఉందని, ఇందుకు కాంట్రాక్టర్లు సుబ్బారెడ్డి, మధుకర్ రెడ్డి, చలపతి రెడ్డి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. దీంతో కిన్నెరసాని ఇసుకను లోడుకు రూ.60 వేల చొప్పున హైదరాబాద్ అమ్ముకుంటూ అక్రమంగా లక్షల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు.

చోరీ కేసు నమోదు

దమ్మపేట: మహిళ మెడలోని నాను తాడు చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని గట్టుగూడెం గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని గట్టుగూడెం గ్రామానికి చెందిన పచ్చిపులుసు వీరమణి సోమవారం రాత్రి 9:30 గంటల సమయంలో వంట గదిలో పాత్రలను శుభ్రం చేస్తోంది. అదే సమయంలో ఇంటి వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలో ఉన్న బంగారు నాను తాడును బలవంతంగా లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

200 లీటర్ల నాటుసారా స్వాధీనం

చర్ల: అక్రమంగా రవాణా చేస్తున్న 200 లీటర్ల నాటుసారాను ఎక్సైజ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పామేడు ప్రాంతం నుంచి చర్ల మండలానికి మూడు బైక్‌లపై నాటు సారా తరలిస్తుండగా తాలిపేరు ప్రాజెక్ట్ వద్ద ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పారిపోగా కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.తిరుపతి, ఎస్సై షేక్ ముభసిర్ అహ్మద్ పాల్గొన్నారు.

బార్‌షాపులో వ్యక్తిపై దాడి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో ఉన్న ఓ బార్ షాపులో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. బార్ షాపులో మద్యం తాగేందుకు వచ్చిన యువకులు హంగామా చేస్తే వాగ్వాదం చేసుకున్నారు. ఈ క్రమంలో జగడం సాయి అనే వ్యక్తి తనను కొట్టాడంటూ విజయ్‌కుమార్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లైంగిక వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: వివాహితను లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన ఓ వివాహిత మహిళను ఏదర వెంకటేశ్వరరావు అనే వ్యక్తి కొద్ది రోజులుగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మీయత.. అనురాగం

రేపు రక్షా బంధన్

- విభిన్న రాఖీలతో మార్కెట్లు కళకళ
- మిఠాయి, బట్టల దుకాణాల్లో సందడి
- ఘనంగా జరుపుకోనున్న సోదరసోదరీమణులు


పాల్వంచరూరల్: రాఖీలను కొనుగోలు చేస్తున్న మహిళలు

కొత్తగూడెంటౌన్/పాల్వంచరూరల్: అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనురాగ వేడుక.. రాఖీ పండుగ ఈ నెల 31న ఘనంగా జరుపుకోనున్నారు. సోదరీసోదరుల మధ్య ఆత్మీయతకు ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుంది. అక్కా చెల్లెళ్లు తమ సోదరులకు రాఖీ కట్టగా, సోదరులు గిఫ్ట్‌లు ఇస్తారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ ఆనందం పంచుకుంటారు. ఈ పండుగను కొన్ని ప్రాంతాల్లో శ్రావణ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు. గురువారం రక్షా బంధన్ నిర్వహించనుండగా, ఇప్పటికే మార్కెట్లు రాఖీ దుకాణాలతో కళకళలాడుతున్నాయి. జిల్లా కేంద్రం తోపాటు పాల్వంచ, భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట, ఇతర మండల కేంద్రాల్లో ప్రత్యేకంగా రాఖీ దుకాణాలు వెలిశాయి.

రకరకాల రాఖీలు

వ్యాపారులు రకరకాల రాఖీలు అందుబాటులో ఉంచారు. పిల్లలను, పెద్దలను విశేషంగా ఆకట్టుకునే రాఖీలను విక్రయిస్తున్నారు. బంగారు, వెండి, ప్లాస్టిక్, దూది రాఖీలు ఆకర్షణీయమైన రంగుల్లో ఉన్నాయి. ఒక్కో రాఖీ రూ.10 నుంచి రూ. 500 వరకు విక్రయిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే కొత్త డిజైన్లు మార్కెట్‌లోకి వచ్చాయి. వినాయకుడు, ఓంకారం, స్వస్తిక్ రూపాలతోపాటు చిన్నారులకు ఇష్టమైన బెన్‌టెన్, మిక్కీమౌస్, బొమ్మల ఆకృతి, డోరేమాన్, చోటాభీమ్ వంటి కార్టూన్ల రాఖీలు అందుబాటులో ఉన్నాయి. బంగారుపూత, ముత్యాలతో అలంకరించిన రాఖీలు ఆన్‌లైన్‌లో కూడా విక్రయిస్తున్నారు. చిన్నారుల మనసు దోచేలా రాఖీలు కూడా అందుబాటులో ఉన్నాయి. కాగా, గతంకంటే ధరలు పెరిగాయని, గత సంవత్సరం పది రూపాయలకు విక్రయించిన రాఖీ ఇప్పుడు రూ.20కు విక్రయిస్తున్నారని మహిళలు చెబుతున్నారు.

ఆన్‌లైన్‌లో అనుబంధం

దూరప్రాంతాల్లో ఉండే సోదరులకు గతంలో పోస్టు ద్వారా రాఖీలు పంపేవారు. ప్రస్తుతం డిజిటల్ నెట్‌వర్క్ పెరిగాక ఆన్‌లైన్ ద్వారా రాఖీలు పంపుతున్నారు. స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్‌లో సింగిల్ క్లిక్ ద్వారా దేశవిదేశాల్లో తమ సోదరులకు సోదరీమణులు రాఖీలు పంపించే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌లు కూడా ఉన్నాయి. ఇక వివాహం చేసుకున్న అత్తారింటికి వెళ్లిన ఆడపడచులు రాఖీ పండుగకు పుట్టింటికి వస్తున్నారు. ఉద్యోగ రీత్యా, పనుల రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న తమ సోదరుల ఇళ్లకు పయనమవుతున్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో..

కొత్తగూడెం బాబుక్యాంప్‌లోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ప్రజా ప్రతినిధులు, సంఘసేవకులు, వ్యాపారవేత్తలు, కళాకారులు, క్రీడాకారులతో పాటు అందరిని ఆహ్వానించి రాఖీ సంబరాలు జరుపనున్నారు.


చిన్నారులను ఆకట్టుకుంటున్న బొమ్మల రాఖీలు

జోరుగా అమ్మకాలు



రాఖీ పండుగ మరో రెండు రోజులు ఉన్నప్పటికీ మార్కెట్‌లో రాఖీల అమ్మకాలకు గిరాకీ బాగానే ఉంది. మహిళలు రకరకాల డిజైన్లతో కూడిన రాఖీలను కొంటున్నారు. మా వద్ద రూ.10 నుంచి రూ. 250 ధర పలికే రాఖీలు ఉన్నాయి. అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

– ప్రకాష్, షాపు యజమాని, రామవరం

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక



రాఖీ పండుగపై ఎలాంటి అపోహలు వద్దు. ఈ సారి 31న పండుగ జరుపుకోవాలి. రాఖీ పౌర్ణమి రోజు అక్కా చెల్లెళ్లను గౌరవించడం, మనస్సును సంతృప్తి పరచడం సంప్రదాయంగా వస్తుంది. రాఖీ పండుగ మనందరికీ సోదరిసోదరుల ప్రేమను పంచుతుంది.

– దండిబొట్ల రామాంజన కుమారశర్మ, వేదపండితుడు, శ్రీనగర్‌కాలనీ కొత్తగూడెం

బహుమతుల కోలాహలం..

రాఖీ పండుగ రోజు సోదరీమణులకు సోదరులు బహుమతులు ఇవ్వడం ఆనవాయితీ. దీంతో జిల్లాలోని వ్యాపార కూడళ్లు సందడిగా మారాయి. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం సూపర్‌బజార్, రామవరం, గణేష్‌టెంపుల్, బస్టాండ్ ఏరియా, పోస్టాఫీస్ సెంటర్, విద్యానగర్ కాలనీ, పాలకేంద్రం, రుద్రంపూర్, గౌతంపూర్ తదితర ప్రాంతాల్లో కోలాహలం నెలకొంది. గిఫ్ట్ సెంటర్లు, చీరలు, నగల దుకాణాలు సందడిగా మారాయి. మిఠాయి దుకాణాలకు గిరాకీ పెరిగింది.


విభిన్న డిజైన్‌లో..

జ్వరాలతో తుంగారం విలవిల

ఒక్కో ఇంట్లో నలుగురు వరకు బాధితులు


జ్వరంతో బాధపడుతున్న బాలుడు


జ్వరపీడితురాలి నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

చండ్రుగొండ : మండలంలోని మారుమూల గ్రామమైన తుంగారంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఒక్కో ఇంట్లో ఇద్దరు, ముగ్గురు, నలుగురు చొప్పున మంచం పట్టారు. కొందరు సమీపంలోని సుజాతనగర్ వెళ్లి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొందరు గ్రామంలోని ఓ ప్రైవేటు ప్రాక్టిషనర్ వద్దే వైద్యం పొందుతున్నారు. కానీ జ్వర పీడితులకు ప్రభుత్వం వైద్యం అందడం లేదు. డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు వచ్చినా పీహెచ్‌సీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు ఆళ్ల శివశంకర్ అనే బాలుడు డెంగీ జ్వరంతో బాధపడుతున్నాడు. అతని తండ్రి నాగేశ్వరరావు, తల్లి కృష్ణకుమారి, సోదరుడు రాం శరత్‌లు కూడా జ్వరంతో మంచం పట్టారు. తుంగారంలో జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో 'సాక్షి' మంగళవారం ఉదయం గ్రామాన్ని సందర్శించింది. సమాచారం తెలుసుకున్న డాక్టర్ కనకం తనుజా మధ్యాహ్నం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జ్వరపీడితులను పరీక్షించి వైద్య సేవలు ప్రారంభించారు. ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఇండ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో సాధారణ జ్వరాలే ఉన్నాయని, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు లేవని వైద్యాధికారి తనూజా తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి


వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బూర్గంపాడు: జ్వరాల పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు అన్నారు. లక్ష్మీపురం గ్రామంలోని జ్వర పీడితుల ఇళ్లను, డెంగీ కేసులను ఆయన మంగళవారం పరిశీలించారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించి పీహెచ్‌సీ అధికారి డాక్టర్ లక్ష్మీసాహితికి పలు సూచనలు చేశారు. ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేసి వైద్యులకు తగిన సూచనలు చేశారు. రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సత్యవతి, జీతు, రమణమూర్తి, సడాలదేవి పాల్గొన్నారు.

108 కేజీల గంజాయి స్వాధీనం


పోలీసులు సీజ్ చేసిన కార్లు

పాల్వంచ: అక్రమంగా రెండు కార్లలో తరలిస్తున్న గంజాయిని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఇందిరా కాలనీ వద్ద బీసీఎం ప్రధాన రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం వైపు నుంచి పాల్వంచ వైపు అనుమానాదాస్పదంగా వస్తున్న రెండు కార్లను పట్టణ అదనపు ఎస్‌ఐ రాఘవయ్య ఆపి తనిఖీ చేశారు. కార్లలో 108 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కార్లను సీజ్ చేశారు. గంజాయి తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్యసాయి జిల్లాకు చెందిన వంకర సురేందర్, భయముత్తగా వెంకరమణ, కుంచెపు కృష్ణమూర్తి, బడా మోహన రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. వీరు చింతూరు నుంచి బెంగళూరుకు తరలిస్తున్నట్లు విచారణ తేలింది. గంజాయి విలువ రూ.21.60 లక్షలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పట్టణ ఎస్‌ఐ రాము తెలిపారు.

కొత్తగూడెంలో 18 కేజీలు..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం టూటౌన్ పరిధిలోని రామవరం 14 నంబర్ వద్ద పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న ఎర్రజొన్న ఉమాకాంత్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో పోలీసులు ఆపి తనిఖీ చేయగా, అతని వద్ద సుమారు రూ.3.40 లక్షల విలువైన 18 కేజీల గంజాయి లభించింది. ఏపీలోని ప్రకాశం జిల్లా లింగాల సముద్రం మండలం అన్నబోయిన పల్లికి చెందిన ఉమాకాంత్ సీలేరు నుంచి ప్రకాశం జిల్లాకు గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రమేష్‌కుమార్ తెలిపారు.

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా


స్పోర్ట్స్ డే వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంటౌన్: క్రీడాకారులు హాకీ లెజెండ్ ధ్యాన్ చందన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశం స్టేడియంలో యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నేషనల్ స్పోర్ట్స్ డే ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పరుగు పందెం నిర్వహించగా, ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే వనమా మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజూ మైదానానికి వెళ్లి వ్యాయామం చేయాలని, ఆటలు ఆడాలని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇటీవల నిర్వహించిన సీఎం రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు కూడా బహుమతులు అందించారు. అంతర్జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రకాశం స్టేడియంలో మాస్టర్ ట్రైనర్లు సాయికృష్ణ, కిరణ్‌కుమార్ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. తొలుత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఐఈఓ సులోచన, జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ, తహసీల్దార్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలతోనే మా పయనం


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ దమ్మపేట మండల అధ్యక్షుడు రాజేశ్వరరావు

దమ్మపేట: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బాటలోనే పయనిస్తామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొడ్డాకుల రాజేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అల్లిపల్లి గ్రామంలో తుమ్మల ముఖ్య అనుచరుల సమావేశం నిర్వహించారు. తుమ్మలకు మద్దతుగా, ఆయన రాజకీయ బాటలోనే నడుస్తామని సమావేశానికి హాజరైన నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా తుమ్మల ఏ నిర్ణయం తీసుకున్నా, సంపూర్ణ మద్దతు తెలుపుతామని పేర్కొన్నారు. అంతకుముందుగా తుమ్మలను ఆయన నివాసం గండుగులపల్లిలో పాలేరు నియోజకవర్గానికి చెందిన నాయకులు, అనుచరులు కలసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ ఎల్లిన రాఘవరావు, గుత్తా రాజా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తుమ్మల అనుచరులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

టేకులపల్లి: ప్రస్తుత సీజన్‌లో వివిధ పంటలను ఆశించే తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఇల్లెందు వ్యవసాయ సహాయ సంచాలకురాలు వాసవీ రాణి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండలంలోని గొల్లపల్లి క్లస్టర్ బొమ్మనపల్లి, కొత్త తండా, బిల్లుడు తండా, మంగ్య తండా గ్రామాల్లో పంటల నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వరి, పత్తి , మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మిరపలో ఎండు తెగులు ఉందని, నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా 5 గ్రాముల ట్రైకోడెర్మా పొడిని కలిపి మొక్కల మొదళ్ల తడిచేటట్లు పోయాలని సూచించారు. వరి పైరులో ఆకు మచ్చ నివారణకు మోనస్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని, వేప నూనె పిచికారీ ద్వారా పైర్లపై వచ్చే పురుగులను అదుపులో ఉంచవచ్చని వివరించారు. విస్తరణ అధికారి జె.భాగ్య శ్రీ, రైతులు పాల్గొన్నారు.

● బొగ్గుట్టలో ఓనమ్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న మలయాళీలు

ఇల్లెందులో మంగళవారం కేరళ సంప్రదాయ ఓనమ్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో నివసిస్తున్న మలయాళీలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి తెల్ల వారుజామునే ఇళ్ల ముందు ముగ్గులతో అలంకరించారు. పూలతో అందంగా తీర్చిదిద్దారు. పలువురు ఒకచోట చేరి సహపంక్తి భోజనాలు చేశారు. నృత్యాలు చేశారు. ఇష్ట దేవతకు పూజలు నిర్వహించారు. మాంటిస్సోరీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ బీజీయుకే జోసఫ్ తదితరులు పాల్గొన్నారు. – ఇల్లెందు

డెంగీ జ్వరంతో వివాహిత మృతి


లావణ్య(ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన వివాహిత ఏర్పుల లావణ్య(23) డెంగీ జ్వరంతో మంగళవారం మృతి చెందింది. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమె అశ్వాపురం పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకుంది. రక్తకణాలు తక్కువగా ఉండటంతో భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు ఇటీవలే వివాహం జరిగింది. మృతురాలికి భర్త నరేష్ ఉన్నాడు. మృతదేహాన్ని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జ్వరంతో మరో యువకుడు..

అశ్వాపురం: మండలంలోని బుడుగుబజార్ గ్రామానికి చెందిన సిద్ద శివ(30) జ్వరంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. శివ సాయంత్రం పొలానికి పురుగుమందు కొట్టాడు. రాత్రి జ్వరం, అస్వస్థతకు గురికావడంతో మండల కేంద్రంలో ఓ ఆర్‌ఎంపీ వద్ద చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించి, అక్కడి నుంచి అంబులెన్స్‌లో భద్రాచలం తీసుకెళ్తుండగానే మృతి చెందాడు. ఆర్‌ఎంపీ నిర్లక్ష్య వైద్యంతోనే యువకుడు మృతి చెందాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై వైద్యాధికారి సంకీర్తనను వివరణ కోరగా విషయం మా దృష్టికి వచ్చిందని, విచారణ చేస్తామని అన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు...


శ్రీనివాసరావు మృతదేహం

సుజాతనగర్: పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటనపై సుజాతనగర్ ఠాణాలో మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ సోమేశ్వర్ కథనం ప్రకారం.. సింగభూపాలెం గ్రామానికి చెందిన యువకుడు బడుగుల శ్రీను (22) సోమవారం గ్రామానికి వెలుపల జరిగిన ముత్యాలమ్మ కొలుపునకు వెళ్లాడు. అక్కడ చికెన్ విషయంలో మరొకరితో గొడవపడ్డాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు ఎందుకు గొడవ పడ్డావంటూ మందలించారు. దీంతో మనస్తాపం చెంది పురుగులమందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్కూటీ, ట్రాలీ ఆటో ఢీ

- దంపతులకు తీవ్రగాయాలు
- చికిత్స పొందుతూ భర్త మృతి

పాల్వంచ: స్కూటీని ట్రాలీ ఆటో ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కొమ్ముగూడేనికి చెందిన వాచ్‌మెన్ మద్దిని శ్రీనివాసరావు (45), అతని భార్య ఉపేంద్ర కలిసి స్కూటీపై లారీ అసోసియేషన్ హాల్ ముందు రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం వైపు నుంచి వస్తున్న ట్రాలీ ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టడంతో శ్రీనివాసరావు, ఉపేంద్రలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన శ్రీనివాసరావు, ఉపేంద్రలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. ఉపేంద్రను మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు నరేంద్ర ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ షేక్ మహ్మద్ రఫీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. కాగా ఆటో పల్టీ కొట్టడంతో ట్రాలీలోని టమాటాలు రోడ్డుపై పడిపోయాయి.

నాణేనికి అటు.. ఢిల్లీలో డ్రామా!

ఎంపిక చేసుకున్న విలేకరుల సమావేశంలో బీజేపీపై చంద్రబాబు ప్రేమ బాణాలు

- తాను మొదటి నుంచీ కేంద్రంలో పొత్తులోనే ఉన్నాడట..
- హోదా కోసమే ఎన్డీఏ నుంచి బయటకు వచ్చానంటూ మరోసారి నాలుక మడత
- హోదా ఏమైనా సంజీవనా?.. ప్యాకేజీ అంతకంటే మెరుగైనదంటూ అర్ధరాత్రి ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పిన విషయం ప్రజలకు గుర్తుండదనే ధీమా
- పోలవరం కాంట్రాక్టుల కోసం హోదాను తాకట్టు పెట్టిన ఘనత బాబుదే
- రామోజీ వియ్యంకుడు, యనమల వియ్యంకుడిని కాంట్రాక్టర్లుగా ప్రవేశపెట్టి డబ్బు దండుకున్న విషయం ఎవరూ మరువలేరు
- రాజధాని పేరుతో బాబు భారీ స్కామ్‌కు తెరతీయడంతో తీవ్ర ప్రజా వ్యతిరేకత
- దాన్ని కేంద్రంపైకి మళ్లించడం కోసం చివరి ఏడాది ఎన్డీఏ నుంచి బయటకు టీడీపీ
- 2019 ఎన్నికల్లో బెడిసికొట్టిన అంచనాలు.. బీజేపీలోకి కోవర్టులను ప్రవేశపెట్టిన బాబు
- తన పార్ట్‌నర్ పవన్‌ను కాషాయం ఫ్రంట్‌లో చేర్చి ఢిల్లీ కరుణ కోసం వేడుకోలు
- ఆ ప్రయత్నాలకు తోడు కొత్తగా పురందేశ్వరి కుటుంబంతో కుదిరిన రాజీని బీజేపీతో పొత్తు కోసం వాడుకుంటున్న చంద్రబాబు



సాక్షి, అమరావతి: పార్టీ భవిష్యత్‌పై ఆశలు ఆవిరవడంతో తీవ్ర నిరాశ, నిస్పృహలో కూరుకుపోయిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తాజాగా బీజేపీతో పొత్తు కోసం ఢిల్లీలో పెద్ద డ్రామానే నడిపారు! ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల కార్యక్రమాన్ని ఇందుకు వినియోగించుకున్నారు. ఆ కార్యక్రమం ముగిసిన తరువాత రెండో రోజు ఢిల్లీలో ఎంపిక చేసుకున్న విలేకరుల సమక్షంలో బీజేపీపై చంద్రబాబు ప్రేమ బాణాలు విసరడం చర్చనీయాంశమైంది. తాను మొదటి నుంచి కేంద్రంలో పొత్తులోనే ఉన్నానంటూ బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ఆయన ప్రయత్నించారు. ప్రత్యేక హోదా కోసమే గతంలో తాను ఎన్డీయే నుంచి బయటకు వచ్చానంటూ తాజాగా చంద్రబాబు మరోసారి నాలుక మడతేశారు. 'హోదా ఏమైనా సంజీవనా..? ప్యాకేజీ అంతకంటే మెరుగైనదంటూ అధికారంలో ఉండగా అర్ధరాత్రి తాను ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పిన విషయం ప్రజలకు గుర్తుండదనే భ్రమతో తనకు అలవాటైన రీతిలో చంద్రబాబు అలవోకగా అబద్ధాలు చెప్పేశారు. పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టుల కోసం ప్రత్యేక హోదాను చంద్రబాబు తాకట్టు పెట్టిన విషయం జనం మది నుంచి చెదిరిపోలేదు. రామోజీరావు, యనమల రామకృష్ణుడు వియ్యంకులను కాంట్రాక్టర్లుగా ప్రవేశపెట్టి ప్రాజెక్టు సొమ్మును ఏటీఎంలా వాడుకుని డబ్బులు దండుకున్న విషయాన్ని ప్రజలెవరూ ఎప్పటికీ మరువలేరు! ఇవన్నీ ఎవరికీ గుర్తుండవనే ఉద్దేశంతో బీజేపీతో పొత్తు కోసం పాకులాడుతూ చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలాడారు!

ప్రజా వ్యతిరేకత నుంచి బయటపడేందుకు ఎన్డీఏ నుంచి బయటకు

చంద్రబాబు అధికారంలో ఉండగా రాజధాని అమరావతి పేరుతో భారీ అంతర్జాతీయ స్కామ్‌కు తెరతీయడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. రాజధాని ముసుగులో ఆయన చేసిన అక్రమాలు బయటపడడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వెల్లి విరిసింది. దీన్ని కేంద్ర ప్రభుత్వంపై మళ్లించడం కోసం తన పాలన చివరి సంవత్సరంలో చంద్రబాబు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చారు. కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లుగా ఎన్నికల్లో ఆయన అంచనాలు బెడిసికొట్టి చిత్తుచిత్తుగా ఓడిపోయారు. వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. దీంతో చంద్రబాబు వెంటనే బీజేపీలోకి తన కోవర్టులను ప్రవేశపెట్టారు. తన మిత్రుడైన పవన్ కల్యాణ్‌ను సైతం కాషాయ ఫ్రంట్‌లో చేర్చారు. ఘోర ఓటమి తర్వాత మళ్లీ ఎలాగైనా బీజేపీ పంచన చేరడానికి చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. ఆ ప్రయత్నాలకు తోడు తాజాగా పురందేశ్వరితో రాజీ చేసుకుని బీజేపీతో పొత్తు అవసరాలకు వాడుకున్నారు. ఇటీవలే బీజేపీ అధ్యక్షురాలైన పురందేశ్వరి కుటుంబంతో చంద్రబాబుకు రాజీ కుదిరింది. బీజేపీలో ఉంటూ చంద్రబాబుకు సహకరించేందుకు పురందేశ్వరి అంగీకరించారు. అందులో భాగంగానే ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల కార్యక్రమం సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు బాబును దగ్గర చేసేందుకు ఆమె తాపత్రయపడ్డారు.

నాణెం విడుదల కార్యక్రమానికి సతీమణిని పిలవరా?

పురందేశ్వరి చంద్రబాబు ఏజెంటులా పనిచేస్తున్నారని ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి ఆరోపించిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమాన్ని ఆయన సతీమణిని పిలవకుండా నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్టీఆర్‌ను చివరి దశలో వంచించి వేధించిన కుటుంబ సభ్యులంతా ఇప్పుడు మరోసారి ఆయన భార్యను అవమానించారు. వేలమంది సమక్షంలో లక్ష్మీ పార్వతిని తన భార్యగా ఎన్టీఆర్ బహిరంగంగానే ప్రకటించిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే. ఆమెను కార్యక్రమానికి రానివ్వకుండా గూడుపుఠాణి చేసి కేవలం చంద్రబాబుకు సన్నిహితులైన కుటుంబ సభ్యులు మాత్రమే ఆ కార్యక్రమానికి హాజరయ్యేలా చేశారు. ఇందులోనే ఎలాంటి గూడుపుఠాణి లేకపోతే లక్ష్మీపార్వతిని పిలవవచ్చు కదా? అనే ప్రశ్నకు సమాధానం లేదు.

ఆ వంకతో నడ్డాతో చంద్రబాబు భేటీ

ఇక ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమం వంకతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో చంద్రబాబు వంగి వంగి మంతనాలాడారు. ఈ భేటీలో టీడీపీ కోవర్టులు తప్ప మిగిలిన పాత బీజేపీ నేతలు ఎవరూ లేకపోవడం కొసమెరుపు. అక్కడ చంద్రబాబు తన పొత్తు ప్రతిపాదనలను నడ్డా ఎదుట పెట్టి ఎలాగైనా పొత్తు కుదిరేలా చూడాలని కోరారు. నడ్డా నుంచి ఆశించిన స్పందన వచ్చిందో లేదో తెలియదు గానీ రెండో రోజు చంద్రబాబు ఎంపిక చేసిన విలేకరుల కోసం లంచ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. అక్కడ మోదీ సర్కార్‌పై తన ప్రేమను చాటుకున్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మంచి సంబంధాలు అవసరమని తాజాగా చంద్రబాబు ప్రవచించారు. చంద్రబాబు తాను సీఎంగా ఉండగా ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చినప్పుడు నల్లజెండాలు ఎగరేయడం, నిరసన తెలియచేస్తూ హోర్డింగ్‌లు పెట్టడం, బీజేపీ అగ్రనేత అమిత్‌షా కారు మీద తిరుపతిలో రాళ్లతో దాడి చేయించిన విషయాలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించటాన్ని నెటిజన్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు. బీజేపీతో పొత్తు కోసం శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్న చంద్రబాబు మరోసారి ఎన్టీఆర్ పేరును ఉపయోగించుకున్నారు. ఎన్టీఆర్ స్మారక నాణెం కార్యక్రమాన్ని తన పొత్తు చర్చల కోసం వినియోగించుకుని మరోసారి ఆయనకు వెన్నుపోటు పొడిచారు.

నవ ప్రపంచాన్ని నిర్మించే శక్తి యువత సొంతం

ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్

ఏఎన్‌యూ: సాంకేతికతను సద్వినియోగం చేసుకుని నవ ప్రపంచాన్ని నిర్మించే శక్తి యువతకు ఉందని ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 39, 40వ స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ హోదాలో పాల్గొన్న గవర్నర్ సందేశం ఇస్తూ మానవాళి ప్రయోజనాలు పరిరక్షించే నూతన ఆవిష్కరణలకు యువత కృషిచేయాలని సూచించారు. చదువు, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు నైతికత, సామాజిక బాధ్యత కూడా ముఖ్యమని చెప్పారు. యువత నేర్చుకునే సాంకేతిక, నైపుణ్యం కేవలం తమ సొంతానికి మాత్రమే కాకుండా సమాజ హితం కోసం వాడాలని సూచించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లు, సంక్షోభాలకు పరిష్కారం చూపే వైవిధ్యభరితమైన ఆవిష్కరణలు చేయడంతోపాటు వాటి ద్వారా అపారమైన అవకాశాలు సృష్టించాలని సూచించారు. యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఏఎన్‌యూ అభివృద్ధి నివేదికను సమర్పించారు. అనంతరం ప్రముఖ సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పలువురు విద్యార్థులకు పీహెచ్‌డీలు, బంగారు పతకాలు, డిగ్రీ పట్టాలు అందించారు.



పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, వీసీ ఆచార్య రాజశేఖర్

వ్యవసాయ రంగ సమస్యలపై అధ్యయనం చేసిన తొలి రాష్ట్రం ఏపీ: సాయినాథ్

వ్యవసాయ రంగంలో సంక్షోభం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ప్రముఖ సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్ చెప్పారు. ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, రైతుల సమస్యలపై తాను 2001–2002 కాలంలో అధ్యయనం చేశానని చెప్పారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో వ్యవసాయ రంగ సంక్షోభంపై అధ్యయనానికి ప్రత్యేకంగా కమిటీని నియమించారని తెలిపారు. ఈ కమిటీ సుదీర్ఘకాలంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం గురించి నిశితంగా అధ్యయనం చేసిందని పేర్కొన్నారు. తన సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు ప్రాంతాల్లో వ్యవసాయరంగ సమస్యలు, వాస్తవ పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేశానని తెలిపారు. ఆ సేవలకు దక్కిన గౌరవంగా ఈ డాక్టరేట్‌ను భావిస్తానని సాయినాథ్ తెలిపారు.

సత్తా చాటుతున్న సహకార బ్యాంకులు

టెస్కాబ్ టర్నోవర్ రూ.19 వేల కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సహకార బ్యాంకులు లాభాల బాటపట్టాయి. గతంలో కంటే టర్నోవర్‌లోనూ, లాభాల్లోనూ మేటిగా నిలబడ్డాయి. రైతులకు అధిక రుణాలిస్తూ ముందు వరుసలో ఉన్నాయి. ముఖ్యంగా డీసీసీబీలు, ప్యాక్స్‌లు క్షేత్రస్థాయిలో విభిన్న రంగాల్లో వ్యాపారాలు చేస్తూ లాభాలను గడిస్తున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వార్షిక టర్నోవర్ భారీగా పెరిగింది. ఈ మేరకు మంగళవారం నివేదిక విడుదల చేసింది. 2015లో ఈ బ్యాంకు వార్షిక టర్నోవర్ కేవలం రూ. 6,307 కోట్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం ఇది రూ. 19,021 కోట్లకు పెరిగింది. అంటే ఎనిమిదేళ్లలో టెస్కాబ్ టర్నోవర్ మూడు రెట్లు పెరగడం గమనార్హం. దీంతో పాటు లాభాలు కూడా అదే స్థాయిలో పెరిగాయి. 2015లో ఆ బ్యాంకు లాభాలు కేవలం రూ. 27.81 కోట్లు మాత్రమే కాగా, ప్రస్తుతం ఇది రూ. 133 కోట్లకు పెరిగింది. గతేడాది తొలిసారిగా రూ. 100 కోట్ల లాభాల మార్జిన్‌ను బ్యాంకు చేరుకుంది. టెస్కాబ్ ద్వారా రుణాల మంజూరు కూడా భారీగా పెరిగింది. 2015లో కేవలం రూ. 2,909 కోట్లు మాత్రమే రుణాలను అందించగా ప్రస్తుతం ఇది రూ. 8,508 కోట్లకు పెరిగింది. టెస్కాబ్, డీసీసీబీలు, ప్యాక్స్‌లు దేశంలో అనేక అవార్డులు సాధిస్తూ ప్రతిభ కనబరుస్తున్నాయి. దేశంలోని సహకార బ్యాంకుల్లో సాంకేతికత వినియోగాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ ఘనత సాధించింది. దీంతో పాటు సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్‌ను నెలకొల్పిన తొలి సహకార బ్యాంకులు కూడా తెలంగాణ సహకార బ్యాంకులే కావడం గమనార్హం. అదే విధంగా అన్ని ప్రాథమిక సహకార సంఘాల (ప్యాక్స్)ను కంప్యూటరైజేషన్ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. 2018–19లో 798 ప్యాక్స్‌లు ఉండగా ప్రస్తుతం వీటి సంఖ్య 825కి పెరిగింది.

ఉత్తమ సేవలు అందిస్తున్నాం..

రైతులకు, వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రైతులకు సరళ పద్ధతిలో రుణాలు మంజూరు చేస్తున్నాం. ప్యాక్స్‌ల ద్వారా ఇతర వ్యాపారాలు చేస్తూ వాటి లాభాలను మరింత పెంచాం. టెస్కాబ్, డీసీసీబీ, ప్యాక్స్ టర్నోవర్‌తో పాటు లాభాలు పెరిగాయి. ఇంకా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. వాణిజ్య బ్యాంకులకు దీటుగా పనిచేస్తున్నాం.

– నేతి మురళీధర్‌రావు, ఎండీ, టెస్కాబ్



తిరుమల పవిత్రోత్సవాలు పరిపూర్ణం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం యాగశాలలో రుత్వికులు హోమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపుతో అభిషేకించి చివరగా చందనం పూత పూశారు. ధూపదీప హారతులు నివేదించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. ఆ తర్వాత శ్రీ మలయప్పస్వామి వారు శ్రీదేవి, భూదేవితో కలిసి విమాన ప్రదక్షిణంగా వెళ్లి ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

కాంట్రాక్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులు బోధించేందుకు కాంట్రాక్టు విధానంలో లెక్చరర్లను నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి తెలిపారు. బోటనీ, తెలుగు, మైక్రో బయాలజీ, పొలిటికల్ సైన్స్, ఎకనావిక్స్ బోధించేందుకు ఒక్కో పోస్టు, కామర్స్ బోధించేందుకు రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణులై, నెట్, సెట్ లేదా పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు సెప్టెంబర్ 1న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, వివరాల కోసం 94910 63083 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.


గిరిజన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పీఓకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏటీడీఓ

భద్రాచలం: గిరిజనుల విద్యార్థుల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. మహబూబాబాద్ ఏటీడీఓ సత్యవతి పీఓను భద్రాచలంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల విషయమై శ్రద్ధ వహిస్తూ వారి అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు.

మహిళలకు ఆర్టీసీ ఆఫర్ !



ఖమ్మం మామిళ్లగూడెం: రాఖీపౌర్ణమి సందర్భంగా సోదరులకు రాఖీ కట్టేందుకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు సంస్థ ఆఫర్ ప్రకటించింది. ఈనెల 30, 31వ తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు గమ్యస్థానానికి చేరాక టికెట్ వెనకాల పేరు, సెల్ నంబర్ రాసి బస్టాండ్‌లోని బాక్సుల్లో వేయాలి. అనంతరం రీజియన్ వారీగా సెప్టెంబర్ 9న డ్రా తీసి ముగ్గురు చొప్పున విజేతలను బహుమతులు అందజేయనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు.

'నివేదన' అర్చకుల్లో ఆనందం

- రూ.10 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ
- అర్చకుల గౌరవ వేతనం రూ.6 వేలు, పడితరానికి రూ.4 వేలు
- ఉమ్మడి జిల్లాలో 415 ఆలయాలకు పథకం అమలు



ఖమ్మం కలెక్టరేట్ సమీపంలోని రామాలయం వద్ద అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: వెనకబడిన ఆలయాలు, వీటిని నిర్వహించే అర్చకుల ప్రయోజనం కోసం రూపొందించిన ధూప దీప నైవేద్య పథకం నిధులు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సంక్షేమ భవనాన్ని మే 31న సీఎం కేసీఆర్ ప్రారంభించిన సందర్భంగా ధూప దీప నివేదన పథకం నిధులను రూ.10 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇందులో రూ.6వేలు అర్చకుడికి గౌరవ వేతనంగా, ధూప దీప నివేదనకు రూ.4వేలుగా నిర్ణయిస్తూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ వి.అనిల్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పథకానికి ఆద్యుడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు ధూప దీప నివేదన పథకాన్ని ప్రారంభించారు. పురాతన ఆలయాల్లో నిత్యం పూజలు నిర్వహించడంతోపాటు అర్చకులకు లబ్ధి జరిగేలా 2007లో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. తొలుత నెలకు రూ.2,500 చొప్పున అందించగా, శిథిలావస్థలోని ఆలయాలు కొంత మేర పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 415 ఆలయాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ధూప దీప నైవేద్యం పథకం 415 ఆలయాలకు అమలవుతోంది. ఇందులో ఖమ్మం జిల్లాలో 305, భద్రాద్రి జిల్లాలో 110 ఆలయాలు ఉన్నాయి. తెలంగాణ ఏర్పడ్డాక ధూప దీప నైవేద్యం(పడితరం) పథకం చెల్లింపులను రూ.6 వేలకు పెంచారు. ప్రస్తుతం మరో రూ.4వేలు పెంచగా, రూ.10వేలకు చేరింది. ఇందులో ధూప దీప నివేదనకు రూ.4 వేలు, అర్చకుడి గౌరవ వేతనం రూ.6 వేలుగా అందుతుంది.

ప్రోత్సాహకం అభినందనీయం



ధూప దీప నైవేద్యం పథకం నగదును ప్రభుత్వం రూ.10 వేలకు పెంచడం అభినందనీయం. ఈ పథకం ద్వారా పురాతన దేవాలయాలకు పూర్వ వైభవం వస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు. ముఖ్యమంత్రి చొరవతోనే ప్రోత్సాహకం పెరిగింది.

– మునగలేటి రమేష్‌శర్మ, డీడీఎన్ అర్చక సంఘం అధ్యక్షుడు, ఖమ్మం జిల్లా

ఆలయాలకు ఆదరణ



ధూప దీప నివేదన పథకంతో ఆలయాలకు ఆదరణ పెరిగే అవకాశం ఉంది. నిత్యం ఆలయాల్లో దీపం వెలిగించటం, నివేదన సమర్పించటం వంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. డీడీఎన్ పథకం నగదును రూ.10 వేలకు పెంచడం సంతోషంగా ఉంది.

– కలిసపుడి అంజనీకుమార్‌శర్మ, డీడీఎన్ అర్చక సంఘం, భద్రాద్రి జిల్లా

రామాలయానికి రెగ్యులర్ ఈఓగా రమాదేవి



బాధ్యతలు స్వీకరించిన ఈఓకు జ్ఞాపిక అందజేస్తున్న ఉద్యోగులు



నిత్యాన్నదాన దాతలకు రశీదు ఇస్తున్న ఇన్‌స్పెక్టర్

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఎల్.రమాదేవి మంగళవారం పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని దేవాదాయశాఖలో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన ఇన్‌చార్జ్ ఈఓగా నియమించారు. ఆమె హయాంలో శ్రీరామనవమి విజయవంతం కావడమే కాక భక్తులు వసతులను మెరుగుపర్చటం, ఆదాయ వనరులను పెంచడంతో పాటు ఆలయ పర్యవేక్షణను గాడిలో పెట్టడంతో రెగ్యులర్ ఈఓగా నియమిస్తూ ఈనెల 14వ తేదీన శాఖ కమిషనర్ అనిల్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో రమాదేవి మంగళవారం దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశాక బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదాశీర్వచనం అందజేయగా, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, డీఈ రవీందర్, సీసీ అనిల్ జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తూనే భక్తులకు మరిన్ని సేవలను అందించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

రామాలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం, సాయంత్రం హవనములను జరిపారు. కాగా ఈ ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. అలాగే, హయగ్రీవ జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక స్నపనం, ఇతర పూజలు జరపనున్నట్లు వైదిక కమిటీ బాధ్యులు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

దేవస్థానం పరిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీకి చెందిన భక్తులు విరాళం అందచేశారు. తిరుపతికి చెందిన రాఘవరాజు, విమల దంపతులు రూ.లక్ష డీడీని అధికారులకు అందజేయగా, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు చేయించారు.

కమ్యూనిస్టుల సత్తా చాటుదాం..

- ఉద్యమాలు నిర్మించడంలో దిట్ట 'సిద్ధి'
- విగ్రహావిష్కరణలో కూనంనేని, చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, పక్కన వెంకటరెడ్డి, నాయకులు

పాల్వంచ: వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టుల సత్తా ఏమిటో పాలకులకు చూపించేలా పనిచేస్తూనే... తెలంగాణలో ఎన్నికలను సవాల్‌ను తీసుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. పాల్వంచ పాత ఆర్టీఓ కార్యాలయం రోడ్‌లో సీపీఐ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి సిద్ధి వెంకటేశ్వర్లు విగ్రహాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టులను తమ అవసరాలకు వాడుకుంటున్నారని అన్నారు. ఈ నేపథ్యాన దేశం, రాష్ట్రాన్ని పీడించుకు తింటున్న శక్తులను ఓడించి ఎర్రజెండా సత్తా చాటేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఇప్పుడు పాలిస్తున్న పార్టీలు నీతి, నిజాయితీని పక్కన పెట్టిన స్వార్థపూరిత రాజకీయాలకు తెరలేపాయని ఆరోపించారు. చంద్రుడిపై అడుగిడితే దానికి కూడా దేవుడి పేరు పెట్టారని... ఈప్రయోగంలో అన్ని మతాలు, కులాల శాస్త్రవేత్తలు పాలు పంచుకోలేదా అని ప్రశ్నించారు. శాస్త్రీయతకు మతం రంగు పులుముతూ సైన్స్‌ను అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, సిద్ధి వెంకటేశ్వర్లు అనేక ప్రజా ఉద్యమాలు నిర్మించి పేదలకు న్యాయం చేశారని గుర్తు చేశారు. అనంతరం చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలను నొక్కి ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేసే ప్రభుత్వాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. మహబూబాబాద్, హనుమకొండ, మహబూబ్‌నగర్, పాల్వంచ తదితర ప్రాంతాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణాలకు సిద్ధి వెంకటేశ్వర్లు కృషి మరువలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, భాగం హేమంతరావు, ఖమ్మం, భద్రాద్రి జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, ఎస్‌కే.సాబీర్ పాషాతో పాటు మహ్మద్ మౌలాన, రావులపల్లి రాంప్రసాద్, సురేశ్, సూర్యదేవర రామ్మోహన్‌రావు, కల్లూరి వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి, సారయ్య, శ్రీనివాస రెడ్డి, శంకర్, చంద్రగిరి శ్రీనివాసరావు, సలీం, భాస్కర్ సిద్ధి కుటుంబీకులు సరళకుమారి, భరత్ పాల్గొన్నారు.

వాలాగ్ర పూజకు అనుమతి

- ఖమ్మం కాల్వొడ్డు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రారంభం
- ప్రతి శనివారం నిర్వహణ



ఆంజనేయ స్వామి ఆలయంలో వాలాగ్ర పూజ చేస్తున్న అర్చకుడు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వాలాగ్ర పూజకు రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆలయంలో మంగళవారం ఈ పూజను ప్రారంభించారు. ఆంజనేయుడి వాలాగ్ర(తోక) పూజను తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే చేస్తున్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, కృష్ణ, గుంటూరు జిల్లాల్లోని కొన్ని ఆలయాల్లో మాత్రమే ఈ పూజ నిర్వహిస్తారు. ఖమ్మం నగరంలో ప్రముఖ ఆంజనేయ స్వామి ఆలయంగా విరాజిల్లుతున్న కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వాలాగ్ర పూజకు అనుమతి లభించడం పట్ల ఆలయ నిర్వాహకులు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పూజ కోసం భక్తులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండగా, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ తీసుకున్న ఈ నిర్ణయంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు ఇక్కడే పూజ చేయించుకునే అవకాశం కలిగింది. వాలాగ్ర పూజతో విద్య, ఉద్యోగం, వ్యాపారం, కల్యాణం, గృహ నిర్మాణం వంటి అంశాల్లో సత్ఫలితాలు కలుగుతాయని అర్చకులు వివరించారు. ఇకపై ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తామని, ఇందుకు రూ.101 ఫీజుగా నిర్ణయించామని, పూజాసామగ్రి భక్తులే తెచ్చుకోవాల్సి ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం నాటి పూజా కార్యక్రమంలో ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ బచ్చు మురళీకృష్ణ, ఈఓ వి.వి.నర్సింహారావు, అర్చకులు ఎస్వీ కృష్ణమాచార్యులు, ఫణిరాజాచార్యులు, నరసింహాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు జి.రవి, ఎం. శ్రీనివాసరావు, సిబ్బంది పి. బేబీ సరోజిని తదితరులు పాల్గొన్నారు.